క్లుప్తంగా

రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులివ్వండి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి కొత్తపల్లి పాలకవర్గం వినతి

యాచారం: గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.కోటి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి కొత్తపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్పంచ్ హబీబుద్దీన్ ఆధ్వర్యంలో వార్డు సభ్యులు సోమవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కొత్తపల్లి నుంచి కొత్తపల్లి తండా వరకు, కొత్తపల్లి నుంచి కిషన్‌పల్లి వరకు బీటీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించాలని వారు కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యనాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు మధు, మాజీ సర్పంచ్ యాదయ్య, సురేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చేగూరి వెంకటేశ్, కార్తీక్, యాదయ్య, ప్రవీన్ తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కృష్ణయ్య యాదవ్

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ కృష్ణయ్య యాదవ్ సోమవారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, ఉప సర్పంచ్ జైపాల్‌రెడ్డి, నాయకులు పర్వాతాలు యాదవ్, రాజేందర్‌యాదవ్, శ్రీశైలం, మల్లేశ్, లక్ష్మీనారాయణగౌడ్, చెన్నయ్య, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

సీపీఎం కన్వీనర్‌గా వెంకటయ్య



ఆమనగల్లు: ఆమనగల్లు ఏరియా సీపీఎం పార్టీ కన్వీనర్‌గా తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన కానుగుల వెంకటయ్యను నియమించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం జరిగిన సీపీఎం సమావేశంలో జిల్లా సీపీఎం కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆమనగల్లు ఏరియా కన్వీనర్‌గా కానుగుల వెంకటయ్యతో పాటు 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల మండలాల సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హయత్‌నగర్: ఇంటిస్థలాలు సాధించుకునే క్రమంలో వేలాది మంది ప్రజలు నివాసముంటున్న రావినారాయణరెడ్డి ఫేజ్–3 కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రాచారి కోరారు. సోమవారం కుంట్లూర్ పాపయ్యగూడలోని సర్వేనెంబర్ 215–224 భూదాన భూమిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుడిసెలు వేసుకున్న పేదలు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మానవతా దృక్పథంతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యాదిరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, అజ్మీరా హరిసింగ్‌నాయక్, దిగోజు వేణుగోపాలచారి, ప్రసాద్, నారాయణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం: బీజేపీ

మంచాల: మంచాల మండల పరిధిలోని చిత్తాపూర్ గ్రామంలో సోమవారం ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల శక్తి కేంద్రం ఇన్‌చార్జి దన్నె భాషయ్య మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఎన్నికల హామీలు అమలుచేయడంలో విఫలమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా సక్రమంగా ప్రజలకు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం సహ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్‌చారి, నాయకులు శ్రీనివాస్, యాదగిరి, సత్తిరెడ్డి, జంగయ్య, పోచయ్య, లక్ష్మయ్య, భిక్షపతి, కృష్ణ, నాగయ్య, రాములు, సతయ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జి పాలనే దిక్కు

- మండల పరిషత్ కార్యాలయంలో పాలన అస్తవ్యస్తం
- వరుసగా దీర్ఘకాలిక సెలువులు పెడుతున్న ఎంపీడీఓ
- మంచాల ఎంపీడీఓకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు
- ఉపాధి పనులు, నర్సరీలపై పర్యవేక్షణ కరువు

ఇబ్రహీంపట్నం: సంవత్సరకాలంగా ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఇన్‌చార్జి ఎంపీడీఓ పాలనలోనే నడుస్తోంది. గతంలో ఎంపీడీఓగా పనిచేసిన మహేశ్‌బాబు 20 జనవరి 2022లో సస్పెన్షన్‌కు గురిఅయ్యారు. దీంతో అదే కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న క్రాంతికిరణ్ 21 జనవరి 2022 ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. సుమారు ఏడు నెలలకుపైగా ఇన్‌చార్జి ఎంపీడీఓగా క్రాంతికిరణ్ సాఫీగానే పనిచేశారు. పూర్తిస్థాయి (రెగ్యులర్) ఎంపీడీఓగా 17 ఆగస్టు 2022న జయరాంవిజయ్ వచ్చారు. కేవలం రెండు నెలల్లోపే విధులను నిర్వర్తించి అక్టోబర్ 22 నుంచి సెలవుపై వెళ్లిపోయారు. దీంతో మంచాల ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. సుమారు 45 రోజుల పాటు ఇన్‌చార్జిగా ఆయన పనిచేశారు. అనంతరం జయరాంవిజయ్ ఎంపీడీఓగా డిసెంబర్ 7న తిరిగి విధుల్లో చేరారు. ఏమైందో ఏమోగాని ఈనెల 7 నుంచి జయరాంవిజయ్ మళ్లీ సెలవుపై వెళ్లారు. ఆ స్థానంలో మంచాల ఎంపీడీఓ శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను తిరిగి అప్పగించారు. ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్న అనంతరం కేవలం ఆరు నెలల్లోనే రెండుసార్లు దీర్ఘకాలిక సెలవులపై జయరాం వెళ్లడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

మండల అభివృద్ధిపై ప్రభావం..

ఇన్‌చార్జి పరిపాలన ప్రభావం మండల అభివృద్ధి పనులపై పడుతుందని పలువురు అంటున్నారు. ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారిగా ఎంపీడీఓనే వ్యవహరిస్తారు. మండలంలోని వేలాదిమంది కూలీలకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ఆయనపై ఉంటుంది. ఉపాధి పనుల ప్రణాళికల రూపకల్పన, కూలీలకు జీవనోపాధి భరోసాను కల్పించడంలో ఆయనదే ప్రధానపాత్ర. వేసవికాలం ప్రారంభం కావడంతో మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో హరితహారం నర్సరీల సంరక్షణ, మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా గ్రామపంచాయతీల్లో తలెత్తుతున్న పలు సమస్యలపై చర్చించి పరిష్కరించాల్సి ఉంటుంది. అంతేగాక ఇన్‌చార్జి పాలనలో గ్రామ కార్యదర్శులపై అజామాయిషీ కొరవడుతుంది. ఇవేగాక మన ఊరు–మనబడి, 15వ ఫైనాన్స్ నిధులతో చేపట్టుతున్న వివిధ నిర్మాణ, అభివృద్ధి పనుల తీరు, పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామాలు, గ్రామాల్లో కొనసాగుతున్న కంటి వెలుగు తదితర కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించాల్సి బాధ్యత ఎంపీడీఓపై ఉంటుంది.

అదనపు భారంతో పరేషాన్..

మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలు, నాలుగు అనుబంధ గ్రామాలున్నాయి. ఆ మండలంలోని అభివృద్ధి పనులను చక్కబెట్టుకోని ఇక్కడ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించాల్సి వస్తుండటంతో ఎంపీడీఓలకు పనిభారం ఎక్కువవుతోంది. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీఓలు సరిపడా సమయాన్ని ఆయా మండలాలకు కేటాయించలేని పరిస్థితి. అధికారులపై, అభివృద్ధి పనులపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడుతుంది. మండలాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని పూర్తిస్థాయి ఎంపీడీఓను కేటాయించాలని ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయం

"అభివృద్ధి కుంటుపడుతుంది



రెగ్యులర్‌గా ఎంపీడీఓ లేక పోవడంతో అభివృద్ధి కుంటుపడుతుంది. ఇన్‌చార్జి ఎంపీడీఓ మండల కార్యాలయానికి ఎప్పుడు వస్తారో ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉంటుంది. వివిధ పనుల నిమిత్తం ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చేవారికి ఇబ్బందిగా ఉంది. తక్షణమే మండలానికి పూర్తిస్థాయి ఎంపీడీఓను నియమించి అభివృద్ధి పనులు సాజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలి.

– చిలుకల యాదగిరి, సర్పంచ్, తులేకలాన్

సమస్యలు పరిష్కరించండి

సబ్‌డివిజన్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ఆమనగల్లు: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు హక్కుల సాధన కోసం రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఆమనగల్లు పట్టణంలోని విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, సిబ్బంది నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దశలవారీ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తమ దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఆమనగల్లు విద్యుత్ శాఖ ఏఈ సీతారాములు, సిబ్బంది భూపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సబ్ డివిజన్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదు

అధికారులకు వినతిపత్రం అందజేసిన గోవిందాయపల్లి రైతులు

కడ్తాల్: ఏక్వాయిపల్లి రోడ్డు నుంచి గోవిందాయపల్లి గ్రామానికి వచ్చే రోడ్డుపై ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని.. కావాలనే గ్రామానికి చెందిన కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమపై తప్పుడు పిర్యాధులు చేస్తున్నారని గోవిందాయిపల్లి గ్రామానికి చెందిన రైతులు వెంకయ్య, నర్సింహ, వెంకటయ్య, ఎల్లాగౌడ్, శేఖర్, శంకరయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ.. సర్వేనంబర్ 107, 108, 109లో మా తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయ పొలం ఉందని, నాటి నుంచి ఆ పోలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. వాస్తవానికి గ్రామప్రజలకు అవసరం ఉన్నంత మేరకు గత కొన్ని సంవత్సరాల నుంచి వాడుకుంటున్నారని రోడ్డుకు మేము ఎలాంటి ఆటంకాలు సృష్టించలేదని తెలిపారు. ఇదిలా ఉండగా గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఓ వెంచర్ నిర్వాహకులతో గ్రామానికి చెందిన కొందరు రియల్ బ్రోకర్లు కుమ్మక్కై, రోడ్డు విస్తరణ చేయాలని తమను నానా ఇబ్బందులు పెడుతున్నారని, దాడులు చేస్తున్నారని, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని వారు కోరారు. ఎంపీటీసీ లచిరామ్‌నాయక్, ఉప సర్పంచ్ ఎల్లాగౌడ్, సాయిలు, ఈదయ్య, శంకరయ్య, జంగయ్య, నర్సింహగౌడ్, వెంకటయ్య, వార్డు సభ్యులు శేఖర్, జంగయ్య, జయమ్మ, రమేశ్, రైతులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కేంద్రం, రాష్ట్రంలో అధికారం మాదే

ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: రాబోయే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చరికొండ గ్రామంలో నిర్వహించిన 'హాథ్‌సే హాథ్' జోడోయాత్ర కార్యక్రమంలో చల్లా వంశీచంద్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలిసి గడపగడపకు వెళ్లి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రాల ద్వారా వివరించారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక..

ఏఐసీసీ కార్యదర్శి రెడ్డి చల్లా వంశీచంద్‌రెడ్డి సమక్షంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు జిల్లా లింగంగౌడ్, బీజేపీ గ్రామ ఉపాధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు పల్లెశివగౌడ్, మహేందర్‌గౌడ్, శివ, సామ రాంరెడ్డి, బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులు జంగయ్య, కొత్తపల్లి కృష్ణయ్య తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రాములుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, సత్యం, రాములు, శ్రీను, రమేశ్, మధు, జనార్దన్‌రెడ్డి, చేగూరి వెంకటేశ్, బీచ్యానాయక్, సర్పంచ్ రాము, మాజీ సర్పంచ్ యాదయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ తదితరులు ఉన్నారు.



వంశీచంద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

'కంటివెలుగు'తో నిరుపేదలకు మేలు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమం సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఇనాంగూడ గ్రామంలో ప్రారంభమైంది. గ్రామ సర్పంచ్ అంతటి యశోదాఊషయ్యగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ బుర్ర రేఖా, జెడ్పీటీసీ బింగి దాసుగౌడ్ హాజరై ప్రారంభించారు. కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సాయిగౌడ్, కోఆప్షన్ సభ్యుడు గౌస్‌పాష, మాజీ ఎంపీటీసీఊషయ్యగౌడ్, మెడికల్ ఆఫీసర్లు లింగస్వామి, సాగర్, ఉపసర్పంచ్ దేశం అచ్చిలేష్‌గౌడ్, వార్డుసభ్యులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదాయిపల్లి, పడకల్‌లో..

తలకొండపల్లి: మండల పరిధిలోని మాదాయిపల్లిలో సర్పంచ్ హైమావతిరామస్వామి, ఎంపీటీసీ అంబాజీ సోమవారం కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. మాదాయిపల్లి, పడకల్ కంటి వైద్య కేంద్రాల్లో 394 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్లు సైదమ్మ, కల్పన, స్నేహ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఏలు మల్లయ్య, రామచంద్రయ్య, హెల్త్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, శివకుమార్, ఏఎన్‌ఎంలు సువర్ణ, ఆశ కార్యకర్తలు, హెచ్‌ఈఓ రవికుమార్, వార్డు సభ్యులు ఎల్లయ్య, రామస్వామి, కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి ఆదరణ



అప్పారెడ్డిపల్లిలో నిర్వహించిన వైద్య శిబిరం

ఆమనగల్లు: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరాన్ని ట్రస్టు చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యులు ఉప్పల వెంకటేశ్ ప్రారంభించారు. హైదరాబాద్ కామినేని ఆస్పత్రి వైద్యులు డా.అఖిల్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి, తలకొండపల్లి ఎంపీపీ నిర్మల శ్రీశైలం గౌడ్, రాష్ట్ర ప్రైవేటు ఆస్పత్రుల బాధితుల సంఘం అధ్యక్షుడు జగన్‌గౌడ్, నాయకులు గోపాల్ నాయక్, హన్మాన్‌నాయక్, సుశీల, పద్మ, యాదయ్య, రాంరెడ్డి, ముత్యాలు, డా.రాంరెడ్డి, శ్రీశైలం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో క్రీడాదుస్తులను పంపిణీ చేశారు.

చెన్నకేశవరెడ్డిని గెలిపించండి

యాచారం: స్థానికుడైన పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డిని అత్యధిక మోజార్టీతో గెలిపించాలని ఆ సంఘం ఎన్నికల జిల్లా ఇన్‌చార్జి ఇన్నారెడ్డి పేర్కొన్నారు. యాచారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలోని ఉపాధ్యాయులను సోమవారం కలిసి గుర్రం చెన్నకేశవ రెడ్డిని అత్యధిక మోజార్టీతో ఎమ్మెల్సీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వాసి, యాచారం మండలానికి చెందిన గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మొదటి ప్రాధ్యాన్యతా ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్, యాచారం మండల అధ్యక్షుడు మరిపల్లి మహేష్ యాదవ్, గౌరవ అధ్యక్షుడు కలకొండ భోజయ్య, ప్రధాన కార్యదర్శి యాదగిరి, నాయకులు అజయ్‌రాథోడ్, బాలకృష్ణ,మహేష్, జగదీష్, చంద్రయ్య పాల్గొన్నారు.

కొహెడ పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

తుర్కయంజాల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బహుజన్ క్లాస్ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ బలపరిచిన అభ్యర్థి డా.ఎస్.విజయ్ కుమార్‌ను గెలిపించాలని కోరుతూ సోమవారం పురపాలక సంఘం పరిధి కొహెడలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం నిర్వహించారు. టీచర్ల సమస్యలపైవిజయ్‌కుమార్ ఎన్నో పోరాటలాలు చేశారన్నారు. బహుజన్ క్లాస్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దన్నెరాజు, ఉపాధ్యాయులు జగన్, లక్ష్మణ్, కొండయ్య, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు బాగుచేయండి: వైఎస్సార్‌టీపీ

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను తక్షణమే బాగుచేయాలని వైఎస్సార్ టీపీ రాష్ట్ర నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వైఎస్సార్ టీపీ ఆధ్వర్యంలో మంచాల మండల కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు ఆయన వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంగయ్యగౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని రోడ్లు కంకరతేలి రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. బుగ్గతండా–ఎల్లమ్మ తండా రోడ్డును తక్షణమే బాగుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు నేనావత్ శ్రీనివాస్, మండల నాయకులు రామారావు, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిరుపేదలకు గూడు కల్పించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్

ఆమనగల్లు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల సీపీఎం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆరోపించారు.రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వారందరికీ భూమిని పంపిణీ చేయాలని, అర్హులైన వారందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని, ఇంటి స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే వారికి తక్షణమే 5లక్షల రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, కవిత, నాయకులు కురుమయ్య, శివశంకర్, పోచయ్య, రమేశ్, నర్సింహా, లాలునాయక్, హంసమ్మ పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ అశోకవర్ధన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పోస్టల్ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎల్మినేడు సర్పంచ్ అశోకవర్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు గ్రామంలో పోస్టల్ సిబ్బందితో కలిసి గ్రామంలో చిన్న మొత్తాల పొదుపు, సుకన్య సంవృద్ధి యోజనతో పాటు ఇతర పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. పోస్టు ఆఫీస్‌లో డిపాజిట్లపై వడ్డీ రేట్లు భారీగా పెంచారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. ఎల్మినేడు గ్రామంలో 100 మంది అమ్మాయిలకు సుకన్య ఖాతాలను సొంత డబ్బులతో తెరిపించి సహకరించినట్లు తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ కార్యాలయంలో పోస్టల్ కార్యాలయం కోసం కేటాయించాలని రాజు సర్పంచ్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు ఆండాలు, బాల్‌రాజ్, బీరప్ప, లచ్చలు, సునీత, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ రాణి , కొలను రాజులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి: బీఆర్‌ఎస్

తలకొండపల్లి: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కుమ్మరి శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని దేవుని పడకల్‌లో ఆయన ఉప సర్పంచ్ తిరుపతి, స్థానిక నాయకులతో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో మంజూరైన రూ.20 లక్షల ఉపాధిహామీ నిధులతో రోడ్డు నిర్మాణపు పనులను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు కోఆర్డినేటర్ అంజయ్యగౌడ్, విద్యా కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ఉప సర్పంచ్ తిరుపతి, సత్యం, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, మల్లేశ్, రమేష్, నర్సింహ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శంకర్

ప్రభుత్వం నిర్ణయించిన రుసుమే తీసుకోవాలి

మీసేవా కేంద్రాల నిర్వాహకులతో తహసీల్దార్ కృష్ణ సమీక్ష

తలకొండపల్లి: ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే లబ్ధిదారుల నుంచి రుసుము తీసుకోవాలని తహసీల్దార్ కృష్ణ మీసేవా కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఆయన మీసేవా కేంద్రాల నిర్వాహకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, కుల, ఆదాయ తదితర ధృవీకరణ సర్టిఫికెట్‌లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలను అమలు చేయాలన్నారు. ఏ ధృవీకరణ పత్రానికి ఎంత తీసుకుంటున్నారో తెలిపే ధరల పట్టికను అన్ని మీసేవా కేంద్రాల్లో ఖచ్చితంగా ఉంచాలన్నారు. ధరల పట్టికలను పెట్టని మీసేవా కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మీసేవా నిర్వాహకులు తప్పుడు పత్రాలను జారీచేసినట్లు రుజువైతే కేసులు నమోదు చేయడంతోపాటు వారి మీసేవా కేంద్రాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీ సంతోష్, ఆర్‌ఐ మంజుల, సర్వేయర్ యాదయ్య, సీనియర్ అసిస్టెంట్ బాలవర్ధన్, మీసేవా నిర్వాహకులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ప్రీతి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గిరిజన నేతలు

మెడికో విద్యార్థిని ప్రీతికి నివాళి

వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్న వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మకు శాంతి కలగాలని కల్వకుర్తి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాల్లో పార్టీలకతీతంగా నేతలు, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. నిందితులను కఠినంగా శిక్షించడంతో పాటు ప్రీతి కుటుంబ సభ్యులకు అన్నివిధాలుగా ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. – సాక్షి, నెట్‌వర్క్



యాచారం: గిరిజనుల కొవ్వొత్తుల ర్యాలీ



ఇబ్రహీంపట్నం: ఏబీవీపీ ఆధ్వర్యంలో..



ఆమనగల్లు: కొవ్వొత్తుల ర్యాలీ తీస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు, గిరిజనులు



కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గిరిజన మోర్చా నాయకులు